సాక్షి
మెదక్
బుధవారం ၊ 18 ၊ డిసెంబర్ ၊ 2024

రాత్రి తొమ్మిది గంటలకే బోసిపోయిన శివ్వంపేట మార్కెట్



చలించని శ్రమైక సౌందర్యం

వణికిస్తున్న చలిలో పేద, మధ్య తరగతి వ్యాపారుల ఉపాధిబాట

జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి విపరీతంగా పెరిగింది. దీంతో ప్రజలు గజగజ వణకుతున్నారు. రాత్రివేళల్లో ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా తమ రోజువారీ పనులు చేసుకుంటున్నారు. జానెడు పొట్ట కోసం పేద, మధ్య తరగతి కుటుంబాలు చలైనా, ఎండైనా, వానైనా తమ దైనందిన పనులకు అడ్డేమీ కాదని చలిపులిని గేలి చేస్తూ తమ పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళ వారం తెల్లవారుజాము వరకు సాక్షి బృందం మెదక్ జిల్లా కేంద్రంలో పర్యటించింది. అర్ధరాత్రి వేళ.. శ్రమైక జీవన సౌందర్యం కనిపించింది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతూ చలి పంజా విసురుతున్నా శ్రమజీవులు ముందుకు సాగుతూనే ఉన్నారు.

– సీహెచ్ నీలమయ్య/మెదక్‌జోన్:

- పారిశుద్ధ్య కార్మికులు, రైతులు, ఆర్టీసీ ఉద్యోగులు సైతం..
- రాత్రి 10 గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యం
- పొగమంచుతో వాహనదారుల ఇబ్బందులు
- మెదక్‌లో మంగళవారం వేకువ జామున సాక్షి బృందం పర్యటన

మెదక్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతుండటంతో చలి విపరీతంగా పెరుగుతోంది. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఇంట్లో నుంచి బయట కాలు పెట్టాలంటేనే జనం జంకుతున్నారు. వణికిస్తున్న చలిలోనూ పేద, మధ్యతరగతి కుటుంబాలు, చిరు వ్యాపారులు మాత్రం బతుకుబండిని నడిపిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, పాల, పూలవ్యాపారులు, ఆర్టీసీ డ్రైవర్లు, పేపర్ బాయ్స్, తెల్లవారక ముందే విధుల్లో చేరుతున్నారు. రైతులు వారు పండించిన కూరగాయలను మార్కెట్‌కు తరలించటం, పేపర్ బాయ్స్, టీకొట్టు వ్యాపారులు ఎముకలు కొరిగే చలిని లెక్క చేయకుండా తమ పనిలో నిమగ్నమవుతున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద అర్ధరాత్రి కూడా ఓ టీకొట్టు యజమాని ఆఖరు బస్సు ప్రయాణికులు వచ్చి టీ తాగుతారంటూ కొట్టు మూయకుండా అలాగే ఎదురుచూస్తున్నాడు. ఇక పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారు జామున రోడ్లను శుభ్రం చేస్తున్నారు. పేపర్‌బాయ్స్ సైతం బస్టాండ్‌కు చేరుకుని పేపర్‌బండిళ్లను సరిచేసుకున్నారు.


మెదక్ బస్టాండ్ వద్ద టీ తాగుతున్న జనం


మెదక్‌లో రోడ్లు ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు


శివ్వంపేటలో చలిమంటలు వేసుకున్న జనం


చేగుంట రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న కూలీలు

వారం రోజులుగా పెరిగిన చలి

గత వారం రోజులుగా చలితీవ్రత అత్యధికంగా నమోదవుతుండగా రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా మొదటిస్థానంలో ఉండగా రెండోస్థానంలో మెదక్ జిల్లా శివ్వంపేటలో కనిష్ట ఉష్ణోగ్రతలు 7.8 నమోదయ్యాయి. వాతావరణ శాఖ ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జిల్లాలోని అన్ని మండలాల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది.

పది దాటితే నిర్మానుష్యం...

కాగా జిల్లాకేంద్రంతో పాటు పలు మండలాల్లో రాత్రి 10 దాటిందంటే అంతా నిర్మానుష్యంగా మారిపోతుంది. జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో సాధారణ రోజుల్లో రాత్రి సెకండ్‌షో సినిమా వదిలే వరకు జన సంచారం ఉండేది. చలితీవ్రత కారణంగా 10 దాటిందంటే ఎవరూ కనిపించటంలేదు. చలికి జడిసి రాత్రిళ్లు సినిమాలకు సైతం వెళ్లకపోవడంతో పట్టణంలోని రెండు సినిమా థియేటర్లు వెలవెల బోతున్నాయి.

ఆర్టీసీ డ్రైవర్లు సైతం...

జిల్లాలో మెదక్, నర్సాపూర్‌లలో ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సుడ్రైవర్లు, కండక్టర్లు చలిలో తెల్లవారు జామున 4 గంటల నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. బస్సులు ప్రయాణిస్తున్నప్పుడు వెలుపలి చలిగాలులు లోపలికి వస్తున్నా అలాగే వారు ప్రయాణికులను గమ్యం చేరుస్తున్నారు.

జిల్లాను కమ్మేస్తున్న పొగమంచు..

ఎప్పుడూ లేనివిధంగా వారం పదిరోజులుగా విపరీతమైన పొగ మంచు కురుస్తోంది. రాత్రి 12 గంటల నుంచి మొదలుకుని ఉదయం 8 గంటల వరకు వదలడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలకు లైట్లు వేసుకుని వెళ్తున్నా దారి కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పటంలేదు.

చలిపంజా..

జిల్లాలోని మక్తభూపతిపూర్, గుట్టకిందిపల్లి, శివ్వాయిపల్లి, తిమ్మనగర్, గంగాపూర్, చేగుంట, చిన్నశంకరంపేట తదితర మండలాలతోపాటు పలుగిరిజన తండాల్లో రైతులు కూరగాయలసాగు చేస్తారు. తెల్లవారుజామునే జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు తరలించి బీట్‌కు తీసుకొస్తారు. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు కొనసాగే బీట్‌లో కూరగాయలను వ్యాపారులు విక్రయిస్తారు. చలి విపరీతంగా ఉన్నప్పటికీ అన్నదాతలు వారు పండించిన ఉత్పత్తులను మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తున్నారు.


చండీ గ్రామంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన చలిమంట

వణుకుతున్న వృద్ధురాలిని ఆస్పత్రికి తరలింపు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ – సంగారెడ్డి రహదారిలోని బీవీ ఆర్‌ఐటీ కళాశాల వద్ద రోడ్డు పక్కన చలిలో వణుకుతున్న ఓ వృద్ధురాలిని పోలీసుల సహకారంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు నర్సాపూర్ కౌన్సిలర్, బీజేపీ నాయకుడు బుచ్చేష్ యాదవ్ మంగళవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరుపట్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు నాలుగు రోజులుగా ఆకలితో అలమటిస్తూ చలిలో వణుకుతూ కాలుకు పెద్ద గాయమై పడి ఉంది. పోలీసులకు, కుటుంబీకులు సమాచారం ఇవ్వడంతో ఆమెను సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.


వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వర్


విద్యార్థినులతో మాట్లాడుతున్న జగదీశ్వర్

సాక్షి ఎఫెక్ట్..

అల్లాదుర్గం(మెదక్): 'వద్దనా వారే...ఊడ్చేదీ వారే'అనే శీర్షికతో సోమవారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వర్ అల్లాదుర్గం బీసీ బాలికల హాస్టల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో బాలికలు ఎలాంటి పనులు చేయొద్దని తెలిపారు. కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అద్దె భవనం అధ్వానంగా ఉందని, సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. వార్డెన్ జూబెద ఉన్నారు.

కొండాపూర్‌లో జేసీ పర్యటన

మనోహరాబాద్(తూప్రాన్): జాయింట్ కలెక్టర్ నాగేష్ ఆధ్వర్యంలో కమిటీ మంగళవారం మనోహరాబాద్ మండలం కొండాపూర్ శివారులోగల 144 సర్వే నంబర్ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ భూమిపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఓ కమిటీ వేశారన్నారు. భూమి పూర్వాపరాలు, రికార్డులు, పట్టదారులు తదితర అంశాలపై నిజనిర్ధారణ చేసి రిపోర్టును నివేదించనున్నట్లు తెలిపారు. అనంతరం మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట హవేళి ఘణాపూర్, చిన్న శంకరంపేట, మనోహరాబాద్ తహసీల్దార్‌లు ఉన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారులు


జమ్మూకాశ్మీర్‌కు తరలిన క్రీడాకారులు

మనోహరాబాద్(తూప్రాన్): జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగే 37వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు తెలంగాణ సబ్ జూనియర్ బాలబాలికల టీం తరలివెళ్లారు. ఈ టీంలో మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన ర్యాకల శ్రీకృతి, టేక్మాల్ గీతికారెడ్డి, నిశాంత్ ఉన్నారు. వీరికి గ్రామానికి చెందిన వెంకట్‌రాజు ట్రాక్‌షూట్(జెర్సీ)లను అందజేశారు.

విజేతగా చిన్నశంకరంపేట కబడ్డీ జట్టు


విజేతగా నిలిచిన చిన్నశంకరంపేట కబడ్డీ జట్టు

చిన్నశంకరంపేట(మెదక్): సీఎం కప్ –2024 జిల్లాస్థాయి పోటీల్లో చిన్నశంకరంపేట కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. మెదక్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 25 జట్లు పోటీపడగా చిన్నశంకరంపేట గెలుపొందినట్లు ఎంపీడీవో దామోదర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కబడ్డీ క్రీడాకారులతోపాటు పీడీలు రత్నం, బస్వరాజ్‌లను ఆయన అభినందించారు.

రైతుబీమా అక్రమాలపై విచారణ

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలంలోని గుట్టకిందిపల్లి గ్రామంలో బతికి ఉండగానే మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రైతుబీమా డబ్బులు కాజేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు మెదక్‌రూరల్ ఎస్‌ఐ మురళి తెలిపారు. ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేసి, అధికారులను తప్పుదోవపట్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ఎవరు ఉన్నా.. వారిని విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఐ మురళి

సర్వే పారదర్శకంగా చేయాలి: కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ: అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. మెదక్ మున్సిపాలిటీలోని దాయర వీధిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇళ్లులేని నిరుపేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. దరఖాస్తుదారులు..సంబంధిత పత్రాలను ముందస్తుగా అందుబాటులో పెట్టుకుని సర్వే వేగవంతం అయ్యేందుకు సహకరించాలని కోరారు. సర్వే కోసం భూమి యాజమాన్యపత్రం ముఖ్యమైనదని అదిలేని పక్షంలో ఇంటి పన్ను రశీదులు, తెల్లరేషన్ కార్డు తదితర పత్రాలను పరిశీలించాలన్నారు. లబ్ధిదారుడితో పాటు ఇంటి పైకప్పు, స్థలానికి సంబంధించిన చిత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ప్రభుత్వ నిర్దేశానుసారం నిజమైన అర్హులను గుర్తించాలని అక్కడి సర్వే సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత యాప్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇంటిని నిర్మించుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేలా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా సర్వే జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీఓ కృష్ణవేణి, ఏపీవో మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుంధతి తదితరులు ఉన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రతిభను గుర్తించడానికే 'సీఎం కప్'

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తోందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆయన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, డీఎఫ్ఓ జోజితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి జిల్లా కేంద్రంలో స్పోర్ట్ అథారిటీ స్టేడియం అందుబాటులో ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించామని చెప్పారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్‌ల సంఘం సెక్రెటరీ శ్రీనివాసరావు, పీడీలు శ్రీధర్ రెడ్డి, మాధవరెడ్డి, రమేశ్, రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

బతికి ఉన్న వ్యక్తికి రైతుబీమా

వివరాలు సేకరిస్తుండగా బయటపడిన వైనం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లిలో ఓ వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి రైతు బీమా డబ్బులు నొక్కేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన లెంక మల్లేశం 2001న మృతి చెందినట్లు అవసరమైన పత్రాలు సమర్పించి రైతుబీమా పథకంలో రూ.5లక్షలు పొందాడు. పీఎం కిసాన్ స్కీమ్ ఎంపికకు చనిపోయిన పేర్లు పంచాయతీ వద్ద చదువుతుండగా మల్లేశం బతికి ఉన్నాడని గ్రామస్తులు తెలుపడంతో ఏఈఓ స్వాతి రికార్డులను పరిశీలించారు. దీంతో అతడి పేరు లేకపోవడంతో హవేళిఘణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా గ్రామంలో కొందరి పొలాలను మల్లేశం సాగుచేసి తిరిగి వేరే ప్రాంతానికి వలస వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు అధికారులు విచారణ చేయవలసి ఉంది.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఏఈఓ స్వాతి

రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి మెదక్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, జైలులో పెట్టడం సరికాదన్నారు. రైతుల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమానీయ, అణచివేత ధోరణిని నిరసిస్తూ రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. రైతులను విడుదల చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, కృష్ణారెడ్డి, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

అంగన్‌వాడీల నిర్వాహణలో నిర్లక్ష్యం వద్దు

సీడీపీఓ పద్మలత


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మలత

పెద్దశంకరంపేట(మెదక్): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అల్లాదుర్గం సీడీపీఓ పద్మలత అన్నారు. మంగళవారం ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో పెద్దశంకరంపేట, రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గం మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎస్, పోషణట్రాకర్, టీహెచ్ఆర్ యాప్‌లో పిల్లల వివరాలు, వారి తల్లిదండ్రుల వివరాలను, ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. బాలామృతం, గుడ్లు తప్పకుండా అందించాలని సూచించారు. విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

పాపన్నపేట(మెదక్): బలరంగ్ మహోత్సవానికి వెళ్తున్న విద్యార్థులకు మంగళవారం వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం హెచ్ఎం మహేశ్వర్ చేతులమీదుగా జరిగింది. ఈనెల 21, 22వ తేదీలలో మధ్యప్రదేశ్.. భోపాల్‌లో జరిగే బలరంగ్‌లో విద్యార్థులు పాల్గొంటారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకిగా మారిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లగచర్లలో ఫార్మాసిటీ ఏర్పాటుకుగాను తమ భూములు ఇవ్వలేదనే కక్షతో రైతులను వేధింపులకు గురిచేశారన్నారు. వారి చేతులకు బేడీలు వేసి మరీ రిమాండ్‌కు తరలించారని ఆరోపించారు. రైతులు టెర్రరిస్టులా అని ప్రశ్నించారు. గ్రామంలో అనారోగ్యానికి గురై మంచం పట్టిన హీర్యానాయక్ అనే రైతు చేతికి బేడీలు వేసి రిమాండ్‌కు తరలించడం కాంగ్రెస్ వైఖరిని తెలియజేస్తుందని ఆరోపించారు. సాక్షాత్తు సీఎం సొంత నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగితా గ్రామాల సంగతేంటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాము బీఆర్ఎస్ తరఫున పోరాడుతామని హెచ్చరించారు.

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

- నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలి
- పాఠశాలల తనిఖీలో డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం అందించిన నూతన మెనూ ప్రకారమే నాణ్యతతో కూడిన భోజనం అందించాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట కస్తూర్బా పాఠశాల, రుద్రారం, చందంపేట ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఏర్పాట్లను, సరుకులను తనిఖీ చేశారు. వంట నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మాప్రాన్, మాస్కులతో పాటు చేతికి గ్లౌజ్‌ను వాడాలని సూచించారు. పరిశుభ్రతను పాటించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. అలాగే పాఠశాల విద్యార్థుల అభ్యాసన ప్రతిభను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎంఓ సుదర్శన మూర్తి ఉన్నారు.


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

క్లుప్తంగా

రేపు చెస్ పోటీలకు ఎంపికలు

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర స్థాయి సీఎం కప్ చెస్ పోటీలకు 19న సిద్దిపేట జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఇన్‌చార్జి డీవైఎస్‌వో జయదేవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లోని హాల్‌లో 19(గురువారం)న అండర్–14 (బాలబాలికలు) విభాగంలో జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2010 జనవరి 1లోపు జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు https:cmcup2024.telangana.gov.in ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 99891 70936 నంబర్‌లో గురువారం ఉదయం 9 గంటలకల్లా సంప్రదించాలని సూచించారు.

సీబీఐ ఆఫీసర్‌నంటూ వీడియో కాల్

- అప్రమత్తమై పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

కల్హేర్(నారాయణఖేడ్): సీబీఐ ఆఫీసర్ అని సైబర్ నేరగాడు వీడియో కాల్ చేసి బెదిరించగా, బాధితుడు అప్రమత్తమై పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ డీ.వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సిర్గాపూర్‌కు చెందిన ముత్యపు సందీప్‌ను యూనిఫామ్‌తో ఉన్న సైబర్ నేరగాడు వీడియో కాల్ చేసి మీ నంబర్ డ్రగ్స్ కేసులో ఉందని బెదిరించాడు. తలుపులు పెట్టుకొని మాట్లాడాలని, ఆధార్, ఓటీపీ వివరాలు అడిగాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. రూ. 2 లక్షలు అకౌంట్ నుంచి కాజేయకుండా అడ్డుకున్నామని పోలీసులు తెలిపారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

శభాష్.. హర్షిత్


సాయి హర్షిత్

సిద్దిపేటజోన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీసరలో జరుగుతున్న అండర్14 ఎస్జీఎఫ్ టోర్నీలో సిద్దిపేటకు చెందిన సాయి హర్షిత్ ప్రతిభ చాటాడు. మంగళవారం ఉమ్మడి మెదక్, సెయింట్ ఆన్స్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో మెదక్ జట్టు నిర్ణీత 45 ఓవర్లలో 310 పరుగులు సాధించింది. వీటిలో సాయిహర్షిత్ 102 పరుగులతో సెంచరీ చేసి జట్టు విజయం సాధించడంలో కీలకమైన పాత్ర పోషించాడు. హర్షిత్ ఆటతీరుపై సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ మల్లికార్జున్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.


పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

అట్టహాసంగా సీఎం కప్ పోటీలు

- జిల్లా వ్యాప్తంగా 1,500 మంది క్రీడాకారులు హాజరు
- అలరించిన సాంస్కృతిక శోభ
- హాజరైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, అదనపు కలెక్టర్ హమీద్
- సిద్దిపేటలో మూడు రోజులు సందడి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటయ్య, పక్కన అదనపు కలెక్టర్ హమీద్


క్రీడాకారుల మార్చ్ పాస్ట్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం క్రీడా పండుగ మొదలైంది. సీఎం కప్ 2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ మూడు రోజుల (17 నుంచి 19 తేదీ)పాటు కొనసాగనుంది. ఈ పోటీలకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 24 మండలాల నుంచి సుమారు 1500 పైగా క్రీడాకారులు హాజరయ్యారు. మొదటి రోజు పోటీలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా అదనపు కలెక్టర్ హమీద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా క్రీడాకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. జిల్లా స్థాయి క్రీడల సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురినిఆకట్టుకున్నాయి.

మూడు రోజులు.. 18 క్రీడాంశాలు

జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి నింపేలా సీఎం కప్ 2024 నిర్వహణకు జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు మంగళవారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించారు. మరుసటి రోజు ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, సైక్లింగ్, అథ్లెటిక్స్ బాక్సింగ్, స్విమ్మింగ్, యోగా, బ్యాడ్మింటన్, చెస్, జూడో, రెజ్లింగ్, నెట్ బాల్, బ్రిలియడ్స్ అంశాల్లో పోటీలు జరుగనున్నాయి. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన జట్లను, క్రీడాకారులను రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు పంపించనున్నారు.

మానసిక పునరుత్తేజానికి..

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా స్థాయి క్రీడలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంచడానికి సీఎం కప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని పేర్కొన్నారు. గెలుపు, ఓటములను సహజంగా స్వీకరించాలని, నేటి ఓటమి రేపటి విజయానికి నాందిగా మారుతుందని పేర్కొన్నారు.

ప్రతిభ చాటాలి: అదనపు కలెక్టర్

అంతకుముందు అదనపు కలెక్టర్ హమీద్ మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఆటలో గెలుపు, ఓటమి ముఖ్యం కాదని సూచించారు. సీఎం కప్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమష్టిగా పని చేయాలని సూచించారు. క్రీడాకారులకు సౌకర్యాలు. భోజన వసతి కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని, అధికార కాంగ్రెస్ నాయకులకు ఆహ్వానం లేదని వాహబ్, గయాజ్ తదితరులు జిల్లా క్రీడల శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు జోక్యంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రీడల శాఖ అధికారి జయదేవ్ ఆర్య, సెట్విన్ ఇన్‌చార్జి అమీనా, కౌన్సిలర్ బుచ్చిరెడ్డి, పీఈటీలు వెంకట్ స్వామి, శ్రీనివాస్ రావు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌కు సింగూరు జలాలు అందించాలి

శాసనసభలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్: సింగూరు జలాలను నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగుకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం శాసనసభలో ప్రభుత్వం దృష్టి తెచ్చారు. నియోజకవర్గంలోని భూములను సస్యశ్యామలం చేస్తామని గత ప్రభుత్వం బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేసినప్పటికీ, ఎలాంటి నిధులు కేటాయించలేదని చెప్పారు. గత ప్రభుత్వం 17,18,19 జీవోలకు సంబంధించి చేపట్టిన పనుల సర్వే చేయించి, నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బసవేశ్వర, సంగమేశ్వర పథకాలకు సర్వేనే ప్రారంభించలేదని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోతలతో సింగూరులో నింపి, ఈ ప్రాంత భూములను సస్యశ్యామలం చేయడం కోసం గత ప్రభుత్వం ఈ పనులు చేపట్టిందని తెలిపారు. నిధులే విడుదల చేయకుండా పనులు ఎలా పూర్తి అవుతాయని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్టు నిర్మాణం వల్ల నియోజకవర్గంలోని మంజీరా పరీవాహక ప్రాంతంలోని రైతుల భూములు అధికంగా కోల్పోయారని తెలిపారు. సింగూరు ప్రాజెక్టును నిర్మించిన నుంచి జంట నగరాల ప్రజల దాహార్తి తీర్చడానికి నీటిని సరఫరా చేయడం జరిగిందన్నారు. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు పూర్తిస్థాయిలో నిధులను కేటాయించి, పనులను సత్వరమే పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంతే కాకుండా 14 పంచాయతీలతో ప్రతిపాదించిన తడ్కల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానమిస్తూ ప్రభుత్వానికి ఈ విషయంలో ఎలాంటి భేషజాలు లేవని, తడ్కల్‌ను మండల కేంద్రంగా చేయడానికి అన్ని వనరులు అనుకూలంగా ఉంటే కచ్చితంగా చేస్తామన్నారు.

లోన్ కట్టలేక వ్యక్తి ఆత్మహత్య


గంగాధర్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): ప్రైవేట్ యాప్‌లో తీసుకున్న లోన్ కట్టలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన మద్ది గంగాధర్ (31)కు భార్య, నాలుగేళ్లలోపు ఇద్దరు కుమారులున్నారు. మిషన్ భగీరథ సంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్న గంగాధర్ గతంలో ఆన్‌లైన్‌లో రూ.లక్షా 20 వేలు అప్పు తీసుకున్నాడు. వాటిని సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ సభ్యులు డబ్బులు చెల్లించారు. ఇటీవలె మళ్లీ రూ. 3లక్షలు ఓ ప్రైవేట్ యాప్ నుంచి రుణం తీసుకున్నాడు. వాటిని తీర్చలేక కొంతకాలంగా సతమతమవుతున్న గంగాధర్ మనోవేదనతో 15న రాత్రి అక్కన్నపేట అటవీ ప్రాంతంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గంగాధర్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని యువకుడు

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. పటాన్‌చెరు హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీలో ఉద్యోగిగా పనిచేస్తున్న బాలయ్య కార్యాలయం పక్కన మంజీరా క్యాంపస్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. అతడి కుమారుడు హేమంత్ బాబు(19) ఓ ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో జైలు

చిన్నకోడూరు(సిద్దిపేట): భూమి విషయమై గొడవ పడి చంపుతానని బెదిరించిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాటిండ్ల మధిర గ్రామం శేఖర్‌రావుపేటకు చెందిన నాంపల్లి కనకయ్య, అదే గ్రామానికి చెందిన నాంపల్లి అంతగిరిని భూమి విషయంలో గొడవ పడి దాడి చేసి చంపుతానని బెదిరించాడు. బాధితుడు అంతగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా కనకయ్యకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు.

భెల్‌లో అగ్ని ప్రమాదం


ఉద్యోగిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్‌లోని ఓ క్వార్టర్స్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్ స్టేడియం సమీపంలోని క్వార్టర్ నంబర్ 2017ఏ లోనుంచి మంగళవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున పొగలు రావడంతో స్థానికులు భెల్ సీఐఎస్‌ఎఫ్‌కు సమాచారం అందించారు. వెంటనే సీఐఎస్‌ఎఫ్ అగ్నిమాపక దళం వచ్చి క్వార్టర్స్‌లో మంటలార్పేశారు. పడకగదిలో అపస్మారకస్థితిలో ఉన్న భెల్ ఉద్యోగిని ఆస్పత్రికి తరలించారు. ఆ క్వార్టర్స్‌లో భెల్ ఉద్యోగి బీరెందర్ సింగ్ నివాసం ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రామచంద్రాపురం పోలీసులు తెలిపారు.

కేవీకేలో హెలిప్యాడ్ స్థలం పరిశీలన

25న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ రాక


పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి కేవీకేకు 25న ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్ రానున్న సందర్భంగా మంగళవారం ఉప రాష్ట్రపతి సీనియర్ పర్సనల్ సెక్రటరీ భరద్వాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్ కేవీకేను పరిశీలించారు. కేవీకేకు ఉపరాష్ట్రపతి హెలికాప్టర్‌లో రానున్న సందర్భంగా హెలిపాడ్ స్థలం, సమావేశ స్థలం, రహదారి ఇతర పరిసరాలను పరిశీలించారు. ఉపరాష్ట్రపతితోపాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు కేవీకేకు రానున్నారు. కేవీకేలో సేంద్రియ సాగు, ప్రకృతి వ్యవసాయం చేసే విధానంతోపాటు, రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్న తీరుపై రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేవీకే హెడ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, ఉదయ్‌కుమార్ తదితరులు కేవీకే గురించి అధికారులకు వివరించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున ఆల్ఫాజోలం పట్టివేత

- రూ.15 లక్షల విలువ చేసే మత్తు పదార్థం స్వాధీనం
- వారం రోజుల వ్యవధిలో 8.20 కిలోలు పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: ఇంట్లో దాచిపెట్టిన నిషేధిత ఆల్ఫాజోలంను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి 20 కిలోల ఆల్ఫాజోలం రాష్ట్రంలోకి తీసుకొచ్చారనే సమాచారం మేరకు ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు అప్రమత్తమయ్యాయి. వారం కిందట నిజామాబాద్ జిల్లా బోధన్‌లో 4.20 కిలోల మత్తు పదార్థంను ఎస్టీఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు, డీఎస్పీ తుల శ్రీనివాసరావు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, 13వ తేదీన సిద్దిపేట నుంచి కిష్టసాగర్‌కు వెళ్తున్న గడ్డమీది రాజుగౌడ్ వద్ద రూ. 25 లక్షల విలువైన 2.5 కిలోల ఆల్ఫాజోలం పట్టుకున్నారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరుపల్లి అర్జున్‌గౌడ్ ఇంట్లో 16తేదీన ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి రూ.15 లక్షల విలువ చేసే 1.5 కిలోల ఆల్ఫాజోలంను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్, సిద్దిపేటలో కలిపి ఇప్పటి వరకు 8.20 కిలోల ఆల్ఫాజోలంను పట్టుకోగా వీటి విలువ రూ. 85 లక్షలు ఉంటుందని తెలిపారు. మిగిలిన ఆల్ఫాజోలం కోసం ఎక్సైజ్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దుబ్బాక మండలం గంబీర్‌పూర్‌కు చెందిన చేపూరి నర్సింహులు ఇందులో ప్రధాన సూత్రధారి అని ఇతను బోధన్‌లో పట్టుబడి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నట్లు తెలిపారు. నర్సింహులు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొత్తంలో ఆల్ఫాజోలంను తీసుకొచ్చి బావమరిది అయిన అర్జున్ గౌడ్, గడ్డమీది రాజుగౌడ్‌తో కలిసి విక్రయిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. ఆల్ఫాజోలంను పట్టుకున్న ఎక్సైజ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తదితరులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బస్సును ఢీకొట్టిన వాహనం

గజ్వేల్‌రూరల్: బస్సును అశోక్ లేలాండ్ వాహనం ఢీకొట్టడంతో నలుగురికి గాయాలు అయ్యాయి. గజ్వేల్ పోలీసులు, బాధిత కుటుంబీకులు కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలం మునిగడకు చెందిన ఆసీఫ్ దౌల్తాబాద్ మండలం తిమ్మకపల్లి వద్ద మటన్ దుకాణం నిర్వహిస్తుండగా తన సోదరుడైన సాజిద్ సైతం కోనాయపల్లిలో మటన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వీరు తమ వద్ద పని చేసే సుధాకర్‌తోపాటు తిమ్మకపల్లికి చెందిన నవీన్‌ను అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటోలో తీసుకొని మేకల కోసం మునిగడపకు వచ్చి తిరుగు పయనమయ్యారు. ఇదే సమయంలో సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తుంది. రాజీవ్ రహదారిపై రిమ్మనగూడ శివారులోని ఔటర్ రింగురోడ్డు వద్ద ఆర్టీసీ బస్సును క్యాసారం వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ లేలాండ్ వాహనంలో ఉన్న ఆసీఫ్, సాజిద్‌కు తీవ్ర గాయాలు కాగా సుధాకర్, నవీన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. బస్సులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు

అయ్యప్ప స్వాములకు తీవ్ర గాయాలు

నర్సాపూర్ రూరల్: అయ్యప్ప గురు స్వాములు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మంగళవారం నర్సాపూర్–హైదరాబాద్ 765డీ జాతీయ రహదారిలోని అర్బన్ పార్క్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన గురుస్వాములు హరిదాస్, జయశంకర్ మెదక్ పట్టణంలో అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కట్టి కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. నర్సాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని అర్బన్ పార్క్ సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. అందోలు మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామ సమీపంలో 11వ తేదీన ఆటో మర్రి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో జోగిపేట పట్టణానికి చెందిన బందిగి గోపాల్ (62)కు తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆరు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలేరో వాహనం ఢీకొన్న వ్యక్తి..


మాణెయ్య (ఫైల్)

రాయికోడ్(అందోల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు.. మండలంలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన బీ.మాణెయ్య (29) స్వగ్రామం నుంచి న్యాల్‌కల్ గ్రామానికి 15వ తేదీన బైక్‌పై వెళ్తున్నాడు. రాయికోడ్ శివారులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం మాణెయ్య బైక్‌ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శామయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్యూటీకి బైక్‌పై వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సాయికుమార్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తు తెలియని వాహన ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకుల కథనం మేరకు.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన మేకల సాయికుమార్(22) ఫ్రెష్ టూ హోమ్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా బైక్‌పై డ్యూటీకి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని 108లో చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి శ్రీశైలం రెండేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందగా, తల్లి శమంతతో కలిసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి తమ్ముడు, చెల్లి ఉన్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

భూమి కోసం ఓ మాజీ సైనికుడి పోరాటం

గ్రామంలో ఐదెకరాల భూమి కేటాయింపు

- మూడెకరాలకు మాత్రమే పట్టా
- మరో రెండింటికి కోసం 26 ఏళ్లుగా తిరుగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఓ మాజీ ఆర్మీ ఉద్యోగి ఆవేదన


మెంగని మల్లేశం

బెజ్జంకి(సిద్దిపేట) : అతనొక సైనికుడు.. దేశ రక్షణ కోసం తన ప్రాణాలు ఎదురొడ్డి సరిహద్దుల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందాడు. 24 ఏళ్ల కిందట దేశ సరిహద్దుల్లో శత్రువులతో పోరాటం చేశాడు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఇప్పుడు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులతో కూడా పోరాటం చేస్తున్నాడు.. తమ హక్కుగా ప్రభుత్వం ఇచ్చిన భూమి కోసం 26 ఏళ్లుగా పోరాడుతున్నాడు మండలంలోని రామసాగరం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మెంగని మల్లేశం. ప్రధాని, రాష్ట్రపతికి లేఖ రాసినా న్యాయం జరగడంలేదంటూ వాపోతున్నాడు. అతను తెలిపిన వివరాల ప్రకారం.. 1981 నుంచి 2005 వరకు ఆర్మీలో సైనికుడిగా చేరి నాయక్, హవల్దార్‌గా పదోన్నతిలో పని చేశాడు. జమ్మూకాశ్మీర్‌లోని పాకిస్థాన్ సరిహద్దులో భోఫర్స్ గన్ హవల్దార్‌గా ఉన్న సమయంలో పలు మార్లు పాక్ ఆక్రమిత కాశ్మీర్, తంగ్‌దర్ సెక్టార్‌లలో ప్రాణాలు అడ్డుపెట్టి పోరాడాడు. హర్యానా రాష్ట్రం అంబాల సెక్టార్‌లోని సరిహద్దులోని చైనా ముష్కరులతో ప్రాణాలకు ఎదురొడ్డి నిలిచాడు. మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాడు. మాజీ ప్రధాని ఇందిరాగాంధి హత్య జరిగినపుడు ఆమె పార్థీవ దేహం వద్ద కాపలా కాసి దేశ సేవలో తరించాడు. మళ్లీ రెండోసారి 2006 నుంచి 2017 వరకు సిపాయిగా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందాడు.

5 ఎకరాల భూమి కేటాయింపు..

సైనికుని నుంచి లాంచ్ నాయక్ బాధ్యతలు చేపట్టాక 1998లో 5 ఎకరాల స్థలం కోసం అప్పటి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. మండలంలోని దాచారం శివారులో గల తమ గ్రామం రామసాగరం (ప్రస్తుతం) గ్రామ పంచాయితీ పరిధిలో ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించింది. కానీ మోఖా పట్టా మాత్రం అధికారులు 3 ఎకరాలకు ఇచ్చారు. మిగితా 2 రెండెకరాల భూమి స్వాధీనంలోనే ఉన్నప్పటికీ పట్టా రాలేదు.

రెండు ఎకరాల కోసం నిత్య పోరాటం..

మిగితా రెండు ఎకరాల భూమి కోసం మండల రెవెన్యూ కార్యాలయం నుంచి రాష్ట్రపతి వరకు వినతిపత్రాలను అందిస్తూ వస్తున్నాడు. మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ నుంచి న్యూఢిల్లీలోని సేవా భవన్‌కు సిఫారస్ చేయించినా ఫలితం లేకపోవడంతో 2012 డిసెంబర్‌లో రక్షణ శాఖ నుంచి జిల్లా అధికారులకు రెకమండ్ చేశాడు. రాష్ట్రపతి, ప్రధాని నుంచి జిల్లా అధికారులకు లేఖలు వచ్చినా ఫలితం లేదని వాపోయారు. అప్పటి డీఆర్‌ఓ వీరబ్రహ్మయ్య స్పందించి 2 ఎకరాల పట్టా ఇవ్వాలని ఆదేశాలిచ్చిన మండల తహసీల్దార్, కరీంనగర్ ఆర్‌డీఓ కార్యాలయాల్లో చేదు అనుభవమే ఎదురైందని వాపోయాడు. ఇప్పటికైనా తన ఆధీనంలో ఉన్న మిగితా భూమికి పట్టా ఇచ్చి ఆదుకోవాలని అధికారులను కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr.J అకాడమి (ISO 90001: 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112 [HA-15347]

SERVICES

BUSINESS SERVICES

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

MARRIAGE SERVICES

■ క్రైస్తవ వివాహ పరిచయ వేదిక డిసెంబర్ 21 శనివారం,10am-2pm@సికింద్రాబాద్ YMCA . మీ ప్రొఫైల్స్‌ను వాట్సాప్ చేయండి. ఫోన్ 7330957771 www.christianholymatrimony.com [HA-99314]

PASSPORT LOST

■ నేను, సయ్యద్ అస్మా భర్త సయ్యద్ షాదుల్లా, నివాసం: ఇంటి నం.7-54, అక్బర్‌పేట్ భూంపల్లి గ్రామం మరియు మండలం, సిద్దిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం తెలియజేయునది ఏమనగా, నేను భూంపల్లిలోని కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్నప్పుడు నా యొక్క పాస్‌పోర్ట్ అప్లికేషన్ నం. 15200612241117492265 గలది పోయినది. కావునా దొరికిన వారు సంప్రదించండి: 9848347642 [H-1214101]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256008]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పెషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA24000827]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.